## క్లుప్తంగా

### 108 వాహనం ప్రారంభం


108 వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**గుత్తి:** స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం కొత్త 108 వాహనాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా 108 జిల్లా మేనేజర్ సంజీవ రెడ్డి, ఓఈ తిరుపతి నాయుడు, జడ్‌ఎఫ్‌ఎం యుగంధర్ మాట్లాడుతూ గుత్తి, గుత్తి మండల ప్రజలు 108 అంబులెన్స్‌ను వినియోగించుకోవాలని కోరారు. వైద్యులు కుసుమ, ఆమని, దివ్య, పరమేష్, 108 ఈఎంటీలు సూర్యకళ, మోహన్, మహేష్, పైలెట్లు సుబ్రమణ్యం (సుబ్బు), సురేష్, హరి పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే చొరవతో తీరిన విద్యుత్ సమస్య

**పామిడి:** ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి చొరవతో స్థానిక చైతన్యకాలనీలో విద్యుత్ సమస్య మంగళవారం తీరింది. కొంతకాలంగా వేలాడుతున్న విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదాన్ని వార్డు ఇన్‌చార్జ్ అబ్దుల్ రజాక్ ఎమ్మెల్యే వైవీఆర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ ఏఈ మధుసూదన్ దృష్టికి తెచ్చారు. ఏఈ, తన సిబ్బందితో కాలనీలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసిన సమస్య పరిష్కరించారు.

### కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత


పింఛన్ అందిస్తున్న వలంటీర్

**గుత్తి రూరల్:** తురకపల్లి వలంటీర్ మంగళవారం కర్నూలుకు వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ పంపిణీ చేశాడు. వివరాలిల. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మహదేవ అనే వృద్ధుడు కుడి కాలు విరగడంతో కర్నూలులోని ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ లింగరాజు తన సొంత ఖర్చుతో కర్నూలు(దాదాపు 200 కి.మీ)కు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు. వలంటీర్‌ను సర్పంచ్ సుందరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, హనుమంతురెడ్డి, రంగస్వామిరెడ్డి అభినందించారు.

### టెన్త్ టాపర్‌కు ల్యాప్‌టాప్ అందజేత


పది టాపర్‌కు ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న దృశ్యం

**యాడికి:** స్థానిక ఉన్నత పాఠశాల అటెండర్ అహరూన్ బాబు కరోనాతో మృతి చెందిన సంగతి విదితమే. అహరూన్ బాబు పుట్టిన రోజును పురస్కరించుకుని అతడి స్నేహితులు పాఠశాల టెన్త్ టాపర్ సుస్వాగత్‌కు మంగళవారం రూ.33,399 విలువైన ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయమ్మ, అహరూన్ బాబు స్నేహితులు కుమార్, విశ్వనాథ్, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, నారాయణస్వామి, వలి, రమణ, మల్లికార్జున, సురేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

### చింతలరాయుడి సన్నిధిలో పీఆర్ డైరెక్టర్


డైరెక్టర్ లావణ్యకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకుడు మురళి

**తాడిపత్రి అర్బన్:** పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ లావణ్య మంగళవారం దర్శించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బాణా నాగేశ్వర్‌రెడ్డి, అర్చకులు మురళీబట్టార్ ఆమెకు స్వాగతం పలికారు. మూల మూర్తిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డైరెక్టర్‌కు తీర్థప్రసాదాలను అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయంలోని శిల్పకళా సౌందర్యాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకుడు ఆలయ విశిష్టతను తెలియజేశారు.

### తాడిపత్రి ఇన్‌చార్జ్ సీఐగా శంకర్‌రెడ్డి



**తాడిపత్రి అర్బన్:** తాడిపత్రి అర్బన్ ఇన్‌చార్జ్ సీఐగా యాడికి రూరల్ సీఐ శంకర్ రెడ్డిని నియమించినట్లు డీఎస్పీ గంగయ్య మంగళవారం తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న ఐఐ ఎ.ఆనందరావు ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో సీఐ శంకర్‌రెడ్డికి తాడిపత్రి ఇన్‌చార్జ్ అర్బన్ సీఐగా అదనపు బాధ్యతలను అప్పగించారు. శంకర్‌రెడ్డి 2019లో ఇదే పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేశారు.

# ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


మహిళకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, పైలా

**తాడిపత్రి:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమమని చేపట్టినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. చిన్నపొడమల గ్రామంలో మంగళవారం జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ కుల,మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కొన్ని కారణాలతో ఇంకా పథకాలు అందని వారికి కూడా న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. పైసా ఖర్చులేకుండా ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పైలా నరసింహయ్య మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ ఫలాలకు దూరం కాకూడదన్న ఆలోచనతో ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ప్రజలకు వరంలాంటిదన్నారు. వలంటీర్లు అర్హులందరికీ ధ్రువపత్రాలు అందేలా చూడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దార్ మునివేలు, రెవెన్యూ, మండల అధికారులు, సచివాలయ అధికారులు, సర్పంచ్ నాగేంద్రమ్మ, ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భోగసముద్రంలో..**

భోగసముద్రం – 2 పరిధిలో మంగళవారం ఎంపీడీఓ రంగారావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఎంపీడీఓ, సచివాలయ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**యాడికి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కమలపాడు, గుడిపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కమలపాడులో నిర్వహించిన ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందిస్తోందన్నారు. కమలపాడులో 382, గుడిపాడులో 160 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నప్ప, తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ లక్ష్మినారాయణ, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, గుడిపాడు సర్పంచు దండు సావిత్రి, వైస్ సర్పంచు శ్రీనివాసులు, నాయకులు రాముడు, చలమారెడ్డి, వెంకటరామిరెడ్డి, మల్లికార్జున, మారుతి, రామిరెడ్డి, జయరామిరెడ్డి, హరీష్‌రెడ్డి, రామకృష్ణ, గంగన్న, భీమేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు :** జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులకు మేలు జరుగుతుందని డీపీఈఓ వెంకటరమణ, తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి పేర్కొన్నారు. మంగళవారం చిన్నవడుగూరులో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 623 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీయువజన విభాగం మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు నాగరాజు, ఆదినారాయణ, డీటీ వెంకటేశ్వరమ్మ, ఆర్ఐ శ్రీనివాసులు, ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

**గుత్తి రూరల్:** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, మండల నోడల్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఊబిచెర్ల గ్రామ సచివాలయంలో సర్పంచ్ చిదంబరి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 234 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శి ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామరంగారెడ్డి, లక్ష్మినారాయణ, నారాయణస్వామి, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

**పుట్లూరు:** అర్హులకు వందశాతం సంక్షేమ పథకాలను అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి ఓబుళమ్మ తెలిపారు. మంగళవారం కడవకల్లు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 168 మందికి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీటీసీ చంద్రకళ, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ ఆనంద్ పాల్గొన్నారు.

**గార్లదిన్నె:** ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసిందని మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి పేర్కొన్నారు. మంగళవారం కల్లూరు గ్రామ సచివాలయం–1,2లో 374 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఎంఈఓ చంద్రనాయక్, కో ఆప్షన్ మెంబర్ బాబా యూనిస్, వైఎస్సార్‌సీపీ నాయకులు బృందావన్ రామాంజనేయులు, రవి, కేశవయ్య, రాఘవేంద్ర, రేఫల్ ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

**బుక్కరాయసముద్రం:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. మంగళవారం కొట్టాలపల్లి గ్రామంలో సర్పంచ్ పార్వతి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ విజయభాస్కర్, సీఐ నాగార్జున రెడ్డి, ఈఓఆర్‌డీ దామోదరమ్మ, ఎంపీటీసీ సుజాత, పంచాయతీ సెక్రటరీ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపప్పూరు:** మండలంలోని చిక్కేపల్లిలో మంగళవారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు పలువురికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పామిడి:** గజరాంపల్లిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ ఎల్ శోభారాణి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, మండల స్పెషలాఫీసర్ అప్పాజీ, తహసీల్దార్ ఆర్‌వీ సునిత బాయి, ఈఓఆర్డీ బీవీ శశికళ పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. సర్పంచ్‌లు రంగమ్మ, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

### విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం


గ్రామస్తుల సమక్షంలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

**గుంతకల్లు రూరల్:** పాతకొత్తచెరువు గ్రామానికి చెందిన గీతవర్షిణి అనే విద్యార్థిని చదువుకోసం ఎమ్మెల్యే వైవీఆర్ వరుసగా రెండో ఏడాది ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇంటర్‌మీడియట్ పరీక్ష ఫలితాల్లో తెలంగాణ టాపర్‌గా నిలిచిన గీతవర్షిణి సీఏ(చార్టెడ్ అకౌంటెంట్) చదవాలని పట్టుదలతో ఉండగా ఆర్థిక పరిస్థితి బాగోలేని కుటుంబ సభ్యులు వెనకడుగు వేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైవీఆర్ గీతర్షిణి చదువుకు అయ్యే ఖర్చును ఏటా తానే భరిస్తానని మాట ఇచ్చారు. చెప్పినట్టుగానే ఎమ్మెల్యే వైవీఆర్ రెండో ఏడాది రూ.47 వేల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

### నేడు తాడిపత్రిలో 'జగనన్న సురక్ష'

**తాడిపత్రి అర్బన్ :** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని ఒకటవ వార్డు, పప్పూరు రోడ్డులోని రెండవ వార్డు సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు కమిషనర్ గుర్రం రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సేవలు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

**యల్లనూరు:** మండలంలోని పెద్దమల్లేపల్లిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల స్పెషలాఫీసర్ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

## టీడీపీ బస్సుయాత్ర అట్టర్‌ఫ్లాప్

● వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామలింగప్ప


మాట్లాడుతున్న రామలింగప్ప

**గుంతకల్లుటౌన్:** భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో టీడీపీ గుంతకల్లులో నిర్వహించిన నిర్వహించిన బస్సుయాత్ర అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.రామలింగప్ప పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బస్సుయాత్ర జనాలు లేక వెలవెలబోయిందన్నారు. సభలో స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిపై మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. మట్టి, ఇసుక అమ్ముకుని బతకాల్సిన ఖర్మ ఇక్కడెవ్వరికీ పట్టలేదన్నారు. గడిచిన పదిహేనేళ్లల్లో ఆపదలో ఉన్న వారికి రూ.లక్షలు ఆర్థికసాయం అందించిన గొప్ప వ్యక్తి ఎమ్మెల్యే వైవీఆర్ అని కొనియాడారు. ఒక సాధారణ జర్నలిస్టుగా జీవితాన్ని కొనసాగించిన కాలవ అనతి కాలంలోనే రూ.వందల కోట్లకు ఎలా పడగెత్తాడని ప్రశ్నించారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.1,800 కోట్లు ఖర్చుచేశామని, వైఎస్సార్ హయాంలో అభివృద్ధే జరగలేదని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. నాలుగేళ్లలో నియోజకవర్గంలోని 7,61,214 మందికి రూ.2,887.86 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తమదన్నారు. ఇక నియోజకవర్గంలో రూ.2,683.88 కోట్లు మంజూరు చేయగా ఇప్పటివరకు రూ.646.29 కోట్లు ఖర్చుచేశామని, మిగిలిన పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని వివరించారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్, ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు, పామిడి మేజర్ గ్రామపంచాయతీగా మార్పు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు, డీఎస్పీ పరిధిలోకి గుత్తి, పామిడి పీఎస్‌ల విలీనం.. ఇలా అనేకం ఉన్నాయన్నారు. ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు మాట్లాడుతూ టీడీపీ శ్రేణులకు క్రమశిక్షణ నేర్పించాలని చంద్రబాబుకు సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బి.సుంకప్ప, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, వార్డు ఇన్‌చార్జ్‌లు మార్కెట్ వెంకటేష్, పీఎస్.మస్తాన్ పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు


గుత్తి: అల్లూరి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి:** పట్టణంలోని స్పెషల్ సబ్ జైల్లో మంగళవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

**పుట్లూరు:** మండల కేంద్రంలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు రాగేని రామాంజి యాదవ్ పాల్గొన్నారు.

### వృద్ధుడికి తీవ్ర గాయాలు

**గుత్తి:** పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న హనుమన్న అనే వృద్ధున్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి


సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్


పి.మట్లగొందిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

● ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

**గుత్తి రూరల్:** ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వానికి మరో మారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గొందిపల్లి, గాజులపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రజలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగన్ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రారంభించి ప్రజల గుమ్మం వద్దే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులకు ఎమ్మెల్యే ఆదేశించారు. గొందిపల్లిలో రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన నంద్యాల వంశీకృష్ణను ఎమ్మెల్యే పరామర్శించారు. వంశీ వైద్య ఖర్చులకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. గుంతకల్లు మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, సర్పంచ్ సుహాసిని, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీలా యాదవ్, స్థానిక నాయకులు నరసింహులు, నంద్యాల ప్రభాకర్, రంగయ్య, రామాంజనేయులు, ప్రసాద్, బాలకృష్ణ, చిన్నగోవిందు, రాజన్న యాదవ్, గోపాల్, సుభాన్, కుళ్లాయి, ఇబ్రహీం, నబీరసూల్, ఇస్మాయిల్, గాజులపల్లి మాజీ ఎంపీటీసీ రాజమ్మ, హనుమంతు, బలరాముడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ రూరల్ కన్వీనర్ సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నేడు కరిడికొండలో..**

కరిడికొండ, ధర్మాపురం గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

**అర్హులందరికీ న్యాయం**

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

**శింగనమల:** అర్హులందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం పి.మట్లగొంది గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నేరవేర్చారన్నారు. ప్రతి కుటుంబం లబ్ధి పొందేలా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ఈపథకాలు అందాయా లేదానని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తెలుసుకుంటున్నామన్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా గెలిచిన తరువాత గ్రామాలకు వచ్చేవారు కాదని, కాని జగనన్న ప్రభుత్వంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకుంటున్నారని ప్రజలు చెబుతున్నారన్నారు. గ్రామంలో సీసీరోడ్డు అడిగారని, వెంటనే పనులు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కోరే రాముడు, నరసింహులు, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, సర్పంచ్‌లు గోపాలురెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీ చిన్న బయ్యన్న, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్వీ నారాయణ, వెంకటరమణ, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన బ్రహ్మోత్సవాలు

**పామిడి:** పట్టణంలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా డబ్బిదార్ ఫిర్కా, రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి అశ్వరథాన్ని పూలతో శోభాయానంగా అలంకరించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవవిగ్రహాలను రథంపై ఉంచి ఊరేగించారు. భావసార క్షత్రియ భజన బృందం సంకీర్తనలతో ముందుకుసాగింది. ఈనెల 11న పామిడమ్మకు హారతి నిర్వహించనున్నట్లు ఫిర్కా సభ్యులు తెలిపారు.

### జగనన్న కాలనీ ఏర్పాటుకు నేడు భూమిపూజ

**గుంతకల్లు రూరల్:** కసాపురంలో జగనన్న లేఅవుట్‌లో బుధవారం భూమి పూజ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి భూమిపూజతో జగనన్న కాలనీ నిర్మాణ పనులను ప్రారంభిస్తారు.

### ఉచిత కంటి ఆపరేషన్లు అభినందనీయం

**గార్లదిన్నె:** సమాజంలో ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం అభినందనీయమని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గార్లదిన్నె జెడ్పీ హైస్కూల్లో ఉచిత కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి శాంతిరామ్ మెడికల్ కాలేజ్ , ఆస్పత్రి కంటి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వ హించారు. ఈసందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ 65 మందికి నంద్యాల శాంతిరామ్ మెడికల్ కాలేజ్, ఆస్పత్రి వసతి, భోజనంతో పాటు ఉచితంగా శస్త్ర చికిత్స చేశారన్నారు. నాయకులు అట్టేశ్రీనివాసులు, ప్రకాష్ రెడ్డి, వైస్ సర్పంచు షేక్షావలి, పెద్దన్న, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

### కంపచెట్ల తొలగింపు

**పామిడి:** మండలంలోని ఖాదర్‌పేట శ్మశాన వాటికలో మంగళవారం సర్పంచ్ కే సుశీలమ్మ ఆధ్వర్యంలో జేసీబీతో కంపచెట్ల తొలగించారు. గ్రామస్తులు సర్పంచ్ పనితీరుపై హర్షం వ్యక్తంచేశారు.

## సంక్షిప్త సమాచారం

**ఉచిత నవోదయ, గురుకుల శిక్షణ**

**గార్లదిన్నె:** పాత కల్లూరులో విద్యార్థులకు నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఉచితంగా ఇస్తున్నట్లు మండల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నరసింహులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బాల, బాలికల కోసం జూన్ 1 నుంచి రోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. 4, 5 తరగతి విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**ఉర్దూ జూనియర్ కళాశాలను ప్రారంభించండి**

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే నియమించి కళాశాలను ప్రారంభించాలని టిప్పు సుల్తాన్ ఇత్తహదుల్ ముస్లిమీన్ కమిటీ రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖలీల్, జిల్లా ఇన్‌ఛార్జ్ ఎంబీ.మౌలా ప్రభుత్వాన్ని కోరారు. ఉర్దూ కళాశాలను ప్రారంభించాలని మున్సిపల్ ఆఫీసు వద్ద జైభీమ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపారు. టిమ్ నాయకులు దాదాఖలందర్, ఇమ్రాన్, సిరాజ్, అక్రమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

**రూ.4.20 లక్షలకు టెంకాయల వేలం**

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి మంగళవారం వేలం పాటం నిర్వహించారు. తొండపాడుకు చెందిన ఉమాదేవి ఏడు నెలలపాటు టెంకాయలు విక్రయించుకునేందుకు రూ.4.20 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, ఆలయ ఈఓ దేవదాసు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ పురుషోత్తం యాదవ్, ఆలయ అర్చకుడు పార్థశారథి శర్మ తదితరులు పాల్గొన్నారు.

**ఈసెట్‌లో మండల విద్యార్థిని ప్రతిభ**

**పెద్దపప్పూరు:** ఈ సెట్‌లో సింగనగుట్టపల్లి గ్రామానికి చెందిన యంపలాకు లింగన్న కుమార్తె వై.శిరీష స్టేట్ మూడో ర్యాంక్ సాధించింది. మంగళవారం పలువురు ఉపాధ్యాయులు విద్యార్థిని స్వగృహానికి వెళ్లి ఆమెకు దుశ్శాలువా కప్పి సన్మానించారు. మౌర్య, సిద్దార్థ పాఠశాలల కరస్పాండెంట్లు ఆంజనేయులు, నారప్ప పాల్గొన్నారు.

**వైద్య సిబ్బందికి సన్మానం**

**శింగనమల:** తరిమెల పీహెచ్‌సీ సీహెచ్‌ఓ శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ బిన్నీ, సచివాలయం ఏఎన్‌ఎం మంజుల బదిలీపై వెళ్లడంతో మంగళవారం వారిని వైద్య సిబ్బంది సన్మానించారు. వైద్యులు ఫిర్దోస్, శంకర్‌నాయక్, మాధవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**పామిడి:** స్థానిక టీసీహైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రామాంజనేయులు, ప్రస్తుత హెచ్‌ఎం మున్వర్‌బాషా ఎంఈఓ–2 గా పదోన్నతులు పొందడంపై మంగళవారం పూర్వ విద్యార్థులు వారిని ఘనంగా సన్మానించారు.

**పేకాటరాయుళ్ల అరెస్ట్**

**తాడిపత్రి:** బోడాయిపల్లి సమీపంలో ఏడుగురి జూదరులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. నిందితుల నుంచి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

**చిరుధాన్యాల సాగు లాభదాయకం**

**బుక్కరాయసముద్రం:** చిరు ధాన్యాల సాగు లాభదాయకమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం కేంద్రంలో రైతులకు చిరు ధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం రైతులకు విత్తన కొర్రలు, కందుల ప్యాకెట్లను అందజేశారు. కేవీకే సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి, విస్తరణా విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చందన పాల్గొన్నారు.

**ఆర్‌యూబీని విస్తరించండి**

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని గుంతబావి వద్దనున్న రైల్ అండర్ బ్రిడ్జిని విస్తరించి ధర్మవరం గేట్ ఏరియా వాసులకు ఇబ్బందులు తొలగించాలని టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అబ్దుల్‌సత్తార్‌ను ఆ ప్రాంతవాసులు కోరారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చాబర్‌లో మాజీ కౌన్సిలర్ అంజితో పాటు పలువురు ధర్మవరం గేట్ రైల్వే కాలనీవాసులు టీపీఎస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. లాయర్ మధు, మాలిక్‌సాబ్, రాజు, లక్ష్మినారాయణ, సూరి, గోవిందు తదితరులు కోరారు.

**వృద్ధులకు కంటి పరీక్షలు**

**తాడిపత్రి:** జీవీపీ కాలనీలో వైఎస్సార్ కంటి వెలుగు కింద మంగళవారం జీపీఎంఓ మధుసూదనరాజు వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 60 మందికి పరీక్షలు నిర్వహించి 10 మందిని శస్త్ర చికిత్స ఎంపిక చేశామన్నారు.

**ఇసుక రీచ్ ఏర్పాటుకు స్థల పరిశీలన**

**యల్లనూరు:** మండలంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతాల్లో నూతనంగా ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు సంబంధించి అనుకూలమైన స్థలాలను మైనింగ్ అధికారి నాగయ్య మంగళవారం పరిశీలించారు. ఈ క్రమంలో శింగవరం, చింతకాయమంద, లక్షుంపల్లి గ్రామాల్లో ఆర్ఐ హరిప్రసాద్‌తో కలసి ఆయన పర్యటించారు.

**రేషన్ బియ్యం పట్టివేత**

**బుక్కరాయసముద్రం:** గుత్తి రోడ్డు సమీపంలో 39 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గుత్తి రోడ్డులో మంగళవారం తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా 39 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడిందన్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.